

'వైసీపీ నుంచి వచ్చిన వారికి కాంట్రాక్టు పనులు ఎలా ఇస్తావు? పార్టీకోసం కష్టపడినవారు చాలా మంది ఉన్నారు. వారు నీకు కనిపించడం లేదా?' కుప్పం నియోజకవర్గంలో సర్వం సహాధికారాన్ని ప్రదర్శిస్తూ రాజ్యాంగ పదవిని అనుభవిస్తున్న ఓ నేతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిలదీత ఇది.

'నువ్వు ఎప్పటికీ ఇలాగే ఉంటావా? ఎప్పటికీ మారవా?' ఇది తొలినుంచీ నియోజకవర్గ బాధ్యునిగా ఉన్న స్నేహితునికి వేసిన చురక.

'నీవల్ల పార్టీకి ప్రయోజనం కనిపించడంలేదు. ఎన్నికల్లో నీ వర్గమంటూ ఉందన్నావు ఎక్కడ.. ఓట్ల శాతం ఎక్కడ పెరిగింది?' అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన నియోకవర్గ స్థాయి నేతకు సంధించిన ప్రశ్న ఇది.

జస్ట్ పాస్!

- ఐవీఆర్ఎస్ సర్వేలో కుప్పం నాయకుల పర్సంటేజి 60లోపే
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఫైర్
- పార్టీ ప్రక్షాళన తప్పదని హెచ్చరిక
- ప్రజాభిప్రాయం మేరకే పదవులని స్పష్టం



కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నంతో చంద్రబాబు

కుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజవకర్గ పరిధిలో యూనిట్, క్లస్టర్, మండల, నియోజక వర్గ స్థాయి నాయకుల పనితీరుపై ఇటీవల రెండు, మూడ్రోజులుగా టీడీపీ నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో నాయక శ్రేణి పూర్తిగా తేలిపోయింది. జస్ట్ పాస్ మార్కులు తెచ్చుకుని చంద్రబాబు ఆగ్రహానికి గురైంది. కొందరు ముఖ్య నేతలకైతే కనీసం 30-40 శాతం పర్సంటేజి కూడా రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో శనివారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు కుప్పం నియోజకవర్గ నేతలకు నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో ఈ విషయం స్పష్టమైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

సర్వే ఫలితాలపై ఆగ్రహం

కుప్పం నియోజకవర్గ పరిధిలోని నేతల పనితీరుపై బూత్ స్థాయినుంచి నియోజకవర్గ స్థాయి దాకా సుమారు మూడు, నాలుగు రోజులపాటు ఐవీఆర్ఎస్ ద్వారా సర్వేను పార్టీ ప్రత్యేకంగా నిర్వహించింది. ఇందులో రాజ్యాంగ పదవిలో ఉంటూ నియోజకవర్గంలో సర్వంసహా అధికారం చెలాయిస్తున్న ముఖ్య నేతకు కేవలం 57 శాతం సానుకూలత లభించింది. అలాగే చంద్రబాబు స్నేహితుడు, సహాధ్యాయి అయిన కుప్పం నియోజకవర్గ పార్టీ బాధ్యునికి 40శాతంలోపే సానుకూలత వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ముందు జాతీయ పార్టీనుంచి టీడీపీలో చేరిన మరో నేతకు 30-40 శాతం మాత్రమే సానుకూలత లభ్యమైంది. నియోజకవర్గ నేతల కంటే యూనిట్ ఇన్‌చార్జిల స్థాయిలో సానుకూల ఫలితాలు అధికంగా వచ్చాయి. దీంతో ఆయా నాయకులపై చంద్రబాబు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాంట్రాక్టులు వారికెలా కట్టబెడతారు?

కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టులను ఇటీవలే పార్టీలోకి జంప్ అయిన వైసీపీ వారికి కట్టబెడుతున్నారని కొందరు నాయకులు.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రబాబు వివరణ కోరగా, కాంట్రాక్టులు పొందినవారు ఎన్నికల ముందే వైసీపీనుంచి టీడీపీలో చేరారని కంచర్ల సమర్థించుకున్నారు. పార్టీకోసం త్యాగాలు చేసిన వారిని కాదని ఇతర పార్టీలనుంచి వచ్చినవారిని ప్రోత్సహించడం మానుకోవాలని చంద్రబాబు హితవు పలికారు.

మీ లోపాలు సరిచేసుకోండి

కడా పీడీ తమను కలుపుకుని పోవడం లేదని ఒకరిద్దరు నాయకులు అధినేతకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు మాట్లాడుతూ.. 'అధికారుల సంగతి నేను చూసుకుంటాను. ముందు మీరు ప్రజల్లోకి వెళ్లండి, ప్రజా సమస్యలపై తక్షణం స్పందిస్తూ ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేయండి' అని సూచించారు. 'మనలో లోపాలు పెట్టుకుని ఇతరుల మీద నిందలు వేయడం భావ్యం కాదన్నారు. మనం అధికారంలో ఉన్నామంటే ప్రజలు, పార్టీ కార్యకర్తలవల్లే. ముందు వారిని పట్టించుకోండి. వారికోసం పని చేయండి. పదవులు వాటికవే వెదుక్కుని వస్తాయి' అని చంద్రబాబు తేల్చి చెప్పారు.

ఆయన ఎవరికి పీఏ

టీడీపీ కార్యాలయంలో ఒక వ్యక్తి పీఏనంటూ అధికారం చెలాయిస్తున్నారని, ఆయన ఎవరికి పీయేనో ఎవరికీ తెలియదంలేదని ఒకరిద్దరు నాయకులు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. 'మీదగ్గర సైలెంట్‌గా ఉంటూ కుప్పంలో సైరన్ మోగిస్తున్నారని, కార్యకర్తలందరిమీదా జులుం చెలాయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అటువంటివేవైనా ఉంటే తాను సరిదిద్దుతానని చంద్రబాబు వారిని సమాధానపరిచారు.

నీ వర్గం ప్రభావం ఏదీ..?

కొంతమంది నాయకులు తమకు చాలా ఫాలోయింగ్ ఉన్నదని చెప్పారని, వారి మాటలకు.. చేతలకు పొంతన కనిపించలేదని చంద్రబాబు ఆక్షేపించారు. ఎన్నికల ముందు జాతీయ పార్టీనుంచి టీడీపీలో చేరిన నాయకుడిని ఉద్దేశించి మాట్లాడుతూ 'నీ వర్గం ఉన్నదని చెప్పారు. నాకైతే కనిపించడం లేదు. ఎన్నికల్లో నీ వర్గం ఎక్కడ పనిచేసింది? ఒకవేళ పని చేస్తే ఫలితాలు ఇలా ఎందుకు ఉంటాయి?' అని నిలదీశారు.

అందరి జాతకాలూ నా దగ్గర ఉన్నాయి

'మీ అందరి జాతకాలూ నా దగ్గర ఉన్నాయి. ఎవరు ఎక్కడ ఏ పని చేసినా లేదా ఎటువంటి కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే నాకు తెలిసిపోతుంది.' అని చంద్రబాబు కుప్పం నాయకులను హెచ్చరించారు. ఇంతకు ముందులా ఎవరి సిఫార్సుల ఆధారంగానో పదవులు కట్టబెట్టే పరిస్థితి ఇక ఉండదన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ప్రజలు, కార్యకర్తలనుంచి నాయకుల పనితీరుపై అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఆ ప్రకారమే నామినేటెడ్ పోస్టులు కానీ, పార్టీ పదవులు కానీ భర్తీ చేస్తామన్నారు. పార్టీని కింది స్థాయి నుంచి పైస్థాయి దాకా ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కుప్పంలో పార్టీని పునర్వ్యవస్థీకరిస్తామని స్పష్టం చేశారు.

రామకుప్పం ఎంపీపీ ఎన్నికపై అసహనం

రామకుప్పం ఎంపీపీ ఎన్నిక విషయంలోనూ చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు. 'మీకు చేతకాకపోతే నాకు చెప్పాలి. అలా కూడా చెప్పలేదు. మీ ఇష్టమొచ్చినట్లు చేసి పార్టీ పరువు తీశారు.' అని అసహనం వ్యక్తం చేశారు. చివరి నిమిషం దాకా ఉత్కంఠ ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురైనందుకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను నిలదీశారు.



ప్రధాన నిందితుడు జయపాల్

శభాష్ పోలీస్

రెండ్రోజుల్లోనే బంగారం దోపిడీ కేసు ఛేదన



డీఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్న కర్ణాటకకు చెందిన మార్వాడీలు

వి.కోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధి నాయకనేరి అటవీ ప్రాంతంలో జరిగిన బంగారం దారి దోపిడీ కేసును రెండ్రోజుల్లోనే పోలీసులు ఛేదించి శభాష్ అనిపించుకున్నారు. బుధవారం రాత్రి అటవీ ప్రాంతంలో దోపిడీ జరిగిందన్న సమాచారంతో అప్రమత్తమైన వి.కోట పోలీసులు ఎస్పీ మణికంఠ ఆదేశాలతో నాలుగు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన ప్రధాన నిందితుడు అక్కడి కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు కౌన్సిలర్ జయపాల్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 3.5 కిలోల బంగారం బిస్కెట్లను రికవరీ చేశారు. ఆదివారం చిత్తూరులో ఈ వివరాలను ఎస్పీ మీడియాకు తెలిపారు.

ముందస్తు ప్రణాళితో..

కేజీఎఫ్‌కు చెందిన ఈ ముఠా ముందస్తు ప్రణాళికతో మార్వాడీ వద్ద ఉన్న డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో తమిళనాడులోని మరికొందరితో కలసి దారి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో దొంగల ముఠా కదలికలను పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని, బంగారాన్ని రికవరీ చేశారు. అయితే ఇంకా 250 గ్రాముల బంగారం రికవరీ చేయాల్సి ఉందని, దానికోసం ప్రత్యేక పోలీసు బృందాలు అన్వేషణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. కాగా, కేసు ఛేదనలో చొరవ చూపిన పలమనేరు డీఎస్పీ డి.ప్రభాకర్, వి.కోట అర్బన్ సీఐ సోమశేఖర్, వారికి సహకరించిన ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు. అలాగే జిల్లా పోలీసులకు కర్ణాటకకు చెందిన మార్వాడీలు, బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జయపాల్ కర్ణాటక పోలీసులను ముప్పతిప్పలు పెట్టాడని.. ఎట్టకేలకు ఆంధ్ర పోలీసులు పక్కా ఆధారాలతో అరెస్టు చేయడంపై అభినందనలు తెలిపారు.

ఏ పనీ లేనివారు 5,79,934 మంది

- ఇప్పటివరకు ప్రభుత్వ సర్వేలో తేలిన లెక్క



కుప్పం మండలం పెద్దబంగారునత్తంలో జరుగుతున్న సర్వే

వివరాలిలా..

కుటుంబాలు	: 4,53,567
జనాభా	: 10,07,649
సర్వే చేసింది	: 8,77,453
వివిధ పనులు చేస్తున్నవారు	: 1,75,417
ఏ పనీ చేయనివారు	: 5,79,934
ఇంటి వద్ద పనిచేస్తున్నవారు	: 14,192
అదనపు వసతులు కావాల్సినవారు	: 5,579

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇండ్ల వద్దనే ఉంటూ పనిచేసే విధానం తీసుకొస్తామని సీఎం చంద్రబాబు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో జిల్లాలో 18-50 ఏళ్ల మధ్య వయసున్న వారిని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వే చేశారు. శనివారంతో నిర్దేశించిన గడువు ముగియడంతో జిల్లాలో ఏ పనీ లేనివారి సంఖ్య 5,79,934గా తేలింది. అయితే ఇంకా సర్వే చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం గడువు పొడిగించింది. ప్రధానంగా డిగ్రీ పట్టభద్రులతో పాటు ఇంజనీరింగ్ చేసిన యువతకు శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పించనున్నారు. ఇందుకోసం రాజధాని ప్రాంతంలోని ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో శిక్షణ ఇప్పిస్తారు. ఇండ్లలో ఇంటర్నెట్ కనెక్షన్ లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. కాగా, జిల్లాలో వర్క్ ఫ్రం హోమ్ సర్వే 94 శాతం పూర్తయ్యిందని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారి రవికుమార్ తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు నేటినుంచి ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. అన్ని యాజమాన్యానికి సంబంధించి 139 జూనియర్ కళాశాలల్లో 17 వేల నుంచి 20 వేల వరకు సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 29 ఉండగా, ఒకేషనల్ రెండు, ప్రైవేటు ఒకేషనల్ కళాశాలలు 5, హైస్కూల్ ప్లస్‌లు 24, కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలలు 8, ఒక రెసిడెన్షియల్ స్కూల్, మోడల్ పాఠశాలలు ఏడు, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 59, సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు 4 ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని సెకండియర్ విద్యార్థులు పాఠ్య, నోట్ పుస్తకాలు ఉచితంగా అందించామన్నారు. ఫస్టియర్ విద్యార్థులకు సైతం పాఠ్య, నోట్ పుస్తకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు చెప్పారు.

నేటినుంచి 'సదరం' సేవలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగుల కోసం సోమవారం నుంచి సదరం స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించనున్నారు. పలమనేరు ఏరియా ఆస్పత్రితో ఆ స్లాట్లు ఓపెన్ చేయనున్నట్లు రాష్ట్ర వైద్యశాఖ అధికారులు మార్గదర్శకాలు విడుదల చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమం జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తవడానికి కొన్ని నెలలు పడుతుంది. దీంతో వైద్యులు అక్కడా, ఇక్కడా రెండు చోట్ల పరిశీలన ఇబ్బంది ఉండడంతో వారానికి ఒక రోజు సదరం క్యాంపు నిర్వహించనున్నారు. ఆర్థోకు 30, ఆప్తమాలజీ విభాగానికి 15చొప్పున స్లాట్లు పరిశీలించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు మీ-సేవ కేంద్రాల్లోనూ స్లాట్ బుకింగ్ ప్రక్రియ నమోదు చేసుకోవచ్చు. నేటినుంచి జరిగే స్లాట్ బుకింగ్‌లకు ఏప్రిల్, మే, జూన్‌లో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని డీసీహెచ్ఎస్ ప్రభావతి తెలిపారు.

నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు.





కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు - మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు శ్రీనివాస భట్టాచార్యులు

వైభవంగా రాములోరి కల్యాణం

- భక్తులతో కిక్కిరిసిన కాణిపాకం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ అలంకార మండపంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఉదయం ప్రధాన ఆలయం నుంచి కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఈవో పెంచలకిషోర్, ఆలయ సిబ్బంది పట్టు వస్త్రాలను అలంకార మండపం వద్దకు తీసుకొచ్చి అర్చకులకు అందించారు. అక్కడ సీతారామ హనుమంత సమేత లక్ష్మణ స్వామివార్ల ఉత్సవర్లకు అభిషేకం చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వందలాదిగా భక్తులు విచ్చేడయంతో కాణిపాకం కిక్కిరిసింది. భక్తులకు వడపప్పు, పానకంను ఆలయాధికారులు అందించారు. గార్గేయి నదీ తీరంలోని కోదండరామాలయంలో ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఏఈవో రవీంద్రబాబు, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి పాల్గొన్నారు.

ఏనుగుల కోసం అడవుల్లోనే గడ్డి పెంపకం

- పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్



పలమనేరులో ఆధునికీకరించిన అటవీశాఖ వసతిగృహం



సిబ్బందికి సూచనలిస్తున్న పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్

పలమనేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో మూడు దశాబ్దాలుగా ఏనుగుల దాడుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏనుగులకు అటవీ ప్రాంతంలోనే కావాల్సిన నీటికుంటలు, ఆహారం కోసం వివిధ రకాల గడ్డి పెంచనున్నాం' అని పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. పలమనేరులో అటవీశాఖ అధికారులు ఆధునికీకరించిన బ్రిటీషు హయాంలో నిర్మించిన అటవీ వసతిగృహాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 120 ఏనుగులు వివిధ ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని చెప్పారు. ఏనుగుల దాడులను అరికట్టేందుకు హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ మంచి ఫలితాలను ఇస్తోందని చెప్పారు. దీన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న అంశమన్నారు. అయినప్పటికీ ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. రైతులే సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునేందుకు 90 శాతం రాయితీ కోరగా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. రైతులకు గత ఏడాది నష్ట పరిహారం పెంచినట్లు తెలిపారు. గతంలో ఏనుగుల దాడుల్లో చనిపోయిన వారికి రూ.5లక్షలు ఇస్తుండగా.. ప్రభుత్వం రెట్టింపు చేసి రూ.10 లక్షల మేర నష్టపరిహారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. అడవుల్లో దాడులకు పాల్పడుతున్న మదగజాలను పలమనేరు వద్ద ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ క్యాంపునకు తరలించి అక్కడ వాటికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలిఫెంట్ క్యాంపు పనులు ఇప్పటి వరకు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. డీఎఫ్‌వో భరణి మాట్లాడుతూ జిల్లాలో కొందరు వన్యప్రాణుల కోసం నాటుబాంబులను తయారుచేసి వినియోగిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఇప్పటికే కొందరిపై అటవీశాఖ నిఘాపెట్టి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. అనంతపురం సీసీఎఫ్ యసోదాబాయ్, పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, పలమనేరు రేంజర్ నారాయణ, ఫారెస్టు సెక్షన్ అధికారి సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ చెలరేగుతున్న భానుడు

- ఎస్‌ఆర్‌పురంలో 39.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మూడ్రోజులుగా చిరుజల్లులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపిన జిల్లా ప్రజలకు ఆదివారం మళ్లీ ఎండ సెగ తగిలింది. ఎస్‌ఆర్‌పురం మండలంలో అత్యధికంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాలవారీగా.. గుడిపాలలో 38.8, తవణంపల్లెలో 38.7, నింద్రలో 38.1, నగరిలో 37.9, చిత్తూరులో 37.8, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, వెదురుకుప్పంలో 37.5, పులిచెర్లలో 37.3, బంగారుపాళ్యం, రొంపిచెర్లలో 37, యాదమరిలో 36.5, సోమలలో 36.4, చౌడేపల్లె, గంగవరం, ఐరాల, పాలసముద్రం, పెద్దపంజాణి, పెనుమూరు, విజయపురంలో 36.3, గుడుపల్లె, కుప్పంలో 35.6, శాంతిపురం, సదుంలో 35.3, కార్వేటినగరంలో 34.9, బైరెడ్డిపల్లె, వి.కోటలో 34.2, పలమనేరులో 33.5, రామకుప్పంలో 33.3, పుంగనూరులో 32.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



బోసిపోయిన చిత్తూరు ఆర్టీసీ బస్టాండు సర్కిల్

గంజాయి 'పుష్ప'లు

ముందు కూలీగా పనికి వెళ్తాడు. తర్వాత అడవిలో ఎర్రచందనం చెట్లను నరికే మాఫియాకు డాన్‌గా ఎదుగుతాడు.. ఇది పుష్ప సినిమాలో హీరో కథ. ముందు కొనుగోలుదారుల్లా వెళ్తారు. తర్వాత సరఫరాదారులుగా మారతారు. ఆ తర్వాత సరఫరాదారులకు లీడర్లు అయిపోతారు.. ఇది రియల్ లైఫ్‌లో గంజాయి స్మగ్లర్ల కథలు. ఒడిశా సరిహద్దుల నుంచి జరుగుతున్న ఈ గంజాయి సరఫరాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా, వివిధ కేసులను విశ్లేషించిన పోలీసులకు 'పుష్ప' కథలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

- ముందు కూలీలు.. ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు
- ఒడిశా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సరఫరా
- స్మగ్లర్లుగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా యువకులు
- రెండ్రోజుల కిందట విజయవాడలో అరెస్టు
- విచారణలో వినిపిస్తున్న పుష్ప సినిమా పోలిన కథలు

షేక్ షాజిద్.. రామసముద్రం మండలం మినికి గ్రామం అతడి సొంతూరు. షేక్ ఫయాజ్.. పుంగనూరు మండలం కొత్తపేట సొంతూరు. ఈ ఇద్దరికీ మధ్యప్రదేశ్‌లోని నాసిక్‌కు చెందిన సంజయ్‌తో సంబంధాలు కలిశాయి. ఇందుకు గంజాయే కారణమైంది. షాజిద్, ఫయాజ్‌ను పటమట పోలీసులు రెండ్రోజుల కిందట ఎనికేపాడులో అరెస్టు చేశారు. వారినుంచి 80 కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. షాజిద్‌పై జిల్లాలో గంజాయి కేసులు ఉన్నాయి. వేర్వేరు గ్యాంగ్‌ల కింద ఇతను కూలీగా పనిచేశాడు. జిల్లా నుంచి బయల్దేరి ఉత్తరాంధ్ర వరకు వెళ్లేవాడు. అక్కడ సరుకును కొనుగోలు చేసి పోలీసులకు చిక్కకుండా గమ్యస్థానాలకు చేర్చేవాడు. ఇలా గంజాయిని మరికొంతమందితో



రెండ్రోజుల కిందట విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన చిత్తూరు జిల్లా గంజాయి స్మగ్లర్లు

కలిసి తీసుకెళ్తుండగా, 2017లో చిల్లకల్లు పోలీసులకు చిక్కాడు. షాజిద్‌తో పాటు మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి అప్పట్లో 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొద్దికాలంపాటు స్తబ్దుగా ఉన్న షాజిద్ మళ్లీ గంజాయి సరఫరాలోకి దిగాడు. సంజయ్.. నాసిక్‌లో గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉండగా, రెండు, మూడు సార్లు గంజాయిని ఉత్తరాంధ్ర నుంచి నాసిక్‌కు షాజిదే పంపించాడు.

'సిల్క్' గంజాయి

షాజిద్ కుటుంబం చిత్తూరు జిల్లాలో పట్టు పురుగులు సాగు చేస్తోంది. వారు చేనేతలకు సిల్క్‌ను కూడా సరఫరా చేస్తుంటారు. ఈనేపథ్యంలో రామసముద్రంలో ఉన్న స్నేహితుల ద్వారా నాసిక్‌లో కొంతమందితో పరిచయం పెంచుకున్న షాజిద్.. 2017 నుంచి ఆ బంధాలు కొనసాగిస్తున్నాడు. అప్పట్లో చిల్లకల్లు పోలీసులకు చిక్కిన షాజిద్.. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తులతో గంజాయి సంబంధాలు కొనసాగించినప్పటికీ పోలీసులకు మాత్రం చిక్కలేదు. ముందుగా నాసిక్‌లో వివిధ గ్యాంగ్‌ల్లో కూలీగా ఒడిశా, ఉత్తరాంధ్ర సరిహద్దులకు వచ్చాడు. తర్వాత తానే స్మగ్లింగ్‌కు కింగ్‌గా మారాడు. కూలీగా వెళ్లిన దానికంటే ప్రధాన స్మగ్లర్‌గా ఉంటేనే డబ్బు బాగా గిట్టుబాటు అవుతోందని భావించాడు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారును గంజాయి స్మగ్లింగ్ కోసం కొన్నాడు. ఎంపీ 06 బీఏ 0710 నెంబరు కలిగిన ఈ కారును చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచే గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గంజాయి కావాలని నాసిక్ నుంచి ఎవరైనా ఫోన్ చేస్తే బేరం మాట్లాడుకుంటాడు. అక్కడి నుంచి వచ్చిన మరొకరిని కార్లో తీసుకుని సరుకు కోసం మన్యానికి తీసుకెళ్తాడు. ఆ విధంగా ఫయాజ్‌ను తీసుకుని వస్తుండగా, నగరంలోని ఎనికేపాడులో పటమట పోలీసులకు దొరికిపోయాడు. ఫయాజ్ స్వయంగా డ్రైవర్ కావడంతో కారును నడపడానికి అతడిని వెంటబెట్టుకుని వచ్చాడు. నర్సీపట్నంలో రూ.2.50 లక్షలకు 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నాసిక్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం రావడంతో పటమట పోలీసులు ఈ తరలింపును తొలిలోనే అడ్డుకున్నారు.

పీజీఆర్ పోలీసు క్వార్టర్స్‌లో 'నవమి' వేడుకలు

- పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్, ఎస్పీ దంపతులు



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ దంపతులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ పోలీసుల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీజీఆర్ పోలీసు క్వార్టర్స్‌లోని సీతారామ దేవాలయంలో జరిగిన వేడుకలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ దంపతులు హాజరయ్యారు. స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్ దంపతులు కూడా పాల్గొన్నారు. పూజారులు వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఎస్పీ, కలెక్టర్, ఏఎస్పీలు సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఆపరేషన్స్ ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాష, చిన్నికృష్ణ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేటమిట్టలో శ్రీరామ నవమి వేడుకలు

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మురళీమోహన్



కల్యాణోత్సవంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, రామచంద్రనాయుడు దంపతులు

పూతలపట్టు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పేటమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు దంపతుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. వరసిద్ధి వినాయకస్వామి ఆలయం తరఫున ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్‌లు పట్టువస్త్రాలు సమర్పించారు. వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పూతలపట్టు, ఐరాల టీడీపీ మండల కన్వీనర్లు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, గల్లా రాజశేఖర్ నాయుడు, వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడితోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు రామలక్ష్మి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని రాజామహల్ ఫంక్షన్ హాలులో ఆదివారం సాహితీవేత్తలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి గతేడాది ప్రచురితమైన కవిత, కథల, నవల, పద్య సంకలనాలకు ఈ సాహితీ సంస్థ నిర్వహించిన పోటీలకు 19 సంకలనాలు వచ్చాయని సంస్థ ఉపాధ్యక్షురాలు రోజా ప్రియ తెలిపారు. ఇందులో 2 నవలలు, 3 పద్య కవితలు, 7 కథల సంకలనాలు, 7 కవిత సంకలనాలను రచయితలు హరినాయుడు, గంటామోహన్, అరుణ, రోజా ప్రియ, రామలక్ష్మిలు సమీక్షలు నిర్వహించారు. గంగవరం నివాసి లక్ష్మి శ్రీనివాస్ ఎప్పుడొస్తుందో వచన కవితల సంకలనం, డా.శ్యామాలాదేవి జీవితసత్యాలు చందో బద్ధ కవితల సంకలనం, కార్వేటినగరం నివాసి మూరిశెట్టి గోవింద్ నాడోడి బతుకులు నవల, తిరుపతి నివాసి టి.రాజగోపాల్ ఆఖరి స్నేహితుడు కథల సంపుటిలను ఎంపిక చేసినట్లు సంస్థ వ్యవస్థాపకురాలు కె.రామలక్ష్మి ప్రకటించారు. విజేతలకు రూ.10వేల నగదు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం సీనియర్ రచయితలు, వ్యవస్థాపకులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కె.రామకృష్ణలను, సమీక్షకులు హరినాయుడు, గంటా మోహన్, అరుణ, తానా సభలో పురస్కారం అందుకున్న పేట యుగంధర్‌ను నిర్వాహకులు సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి పర్యవేక్షణలో పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది.

నాటు బాంబు పేలడంతో

ఏనుగు కాలికి గాయం

- మృతి చెందినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవం: డీఎఫ్‌వో



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏనుగు మృతి చెందినట్లు వివిధ మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని డీఎఫ్‌వో భరణి స్పష్టం చేశారు. ఆదివారం అటవీశాఖ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బంగారుపాళ్యం మండలం జమ్మునేరేడుపల్లె వద్ద నాలుగు రోజుల కిందట నాటు బాంబు పేలి కుక్క చనిపోవడంతోపాటు మరో పేలుడు ఘటనలో ఒక ఏనుగు కాలికి స్వల్ప గాయమైనట్లు గుర్తించామన్నారు. రక్తపు చుక్కలను సేకరించి ల్యాబ్‌కు పంపగా, ఏనుగు కాలి ఎముకకు కొంత గాయమైనట్లు తేలిందన్నారు. ఈ ప్రాంతానికి చెందిన కొందరు ఆరు నాటు బాంబులు అమర్చారన్నారు. వీటిలో రెండు పేలగా, నాలుగింటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై 11 మందిని అనుమానితుల్ని విచారిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.



స్వాధీనం చేసుకున్న నాటు బాంబులు

గస్తీ ముమ్మరం

అటవీ సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేస్తామని డీఎఫ్‌వో తెలిపారు. యాదమరి, బంగారుపాళ్యం ప్రాంతాల్లో తరచూ ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. ఇక్కడి నుంచి గ్రామాలపైకి రాకుండా ఆరు కిలో మీటర్ల మేర సోలార్ కంచె వేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కల్లూరు, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, బోడబండ్ల, టేకుమంద, జమ్మనేరేడుపల్లె, రాచేరు, రాగిమాను పెంట ప్రాంతాల్లో ఏడాది కాలంలో ఏనుగుల ద్వారా జరిగిన పంట నష్టం రూ.1.20 కోట్లు అంచనా వేశామని, ఆ మొత్తాలను రైతులకు దశలవారీగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ట్రైనీ డీఎఫ్‌వో సంకట్ సునీల్, డీఆర్వో ఆనంద రెడ్డి, ఎఫ్ఎస్‌వో మోహన్‌మురళి పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈఈ, లైన్‌మన్ సస్పెన్షన్

వెదురుకుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ కార్వేటినగరం ఏఈఈ రామ్మూర్తి, అన్నూరు లైన్‌మన్ బాబు సస్పెండయ్యారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్, రెవెన్యూ అనుమతి లేకుండా అన్నూరు సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లను నరికి, ప్రభుత్వ విరుద్ధంగా వ్యవహరించడంపై ఫిర్యాదు అందింది. దీంతో వీరిద్దరినీ సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు

కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు

రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మదన్ మృతదేహం

సదుం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సదుం మండలంలో జరిగింది. మండలంలోని పాలమంద పంచాయతీ పెద్దూరు వద్ద ఓ లారీ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్న గ్రామానికి చెందిన మదన్ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి ఎస్ఐ షేక్ షావలి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా పంటపై దుప్పుల దాడులు

సోమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తారంగా సాగులో ఉన్న టమోటా తోటలకు దుప్పుల బెడద తీవ్రంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి సోమల సమీప టమోటా పొలాల్లోకి దుప్పులు చేరుకుని పంటలను ధ్వంసం చేశాయి. మొక్క దశలోనే దుప్పులు తొక్కివేయడంతో మళ్లీ టమోటా నార్లు కొని నాటుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. టమోటా నార్లు మొలక రూపాయి పలుకుతోంది. సాహో రకం నార్లనే రైతులు విత్తుకుంటున్నారు. అధిక ధరలకు నార్లు కొని నష్ట పోతున్నామని రైతులు.. టమోటా సాగు రైతులకు ఉద్యానశాఖ రాయితీ మంజూరు చేయాలని కోరారు. సోమల, కరకమంద, నడింపల్లె, నెల్లిమంద, మేటిమంద తదితర ప్రాంతాల్లో దుప్పుల బెడద అధికంగా ఉంది. అటవీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సిజేరియన్ చేస్తుండగా బిడ్డ తలకు గాయం

జూనియర్ డాక్టర్లు ఆపరేషన్ చేయడం వల్లేనని కుటుంబీకుల ఆరోపణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ గర్భిణికి సిజేరియన్ చేస్తుండగా బిడ్డ తలకు గాయమైంది. దీనికి జూనియర్ డాక్టర్లే కారణమని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం శెట్టిగారిపల్లెకి చెందిన కరుణ శనివారం ప్రసవ వేదనతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఈమెకు సిజేరియన్ చేయాల్సి వచ్చింది. ఈ సమయంలో కడుపులోనే బిడ్డ తలకు కత్తి తగిలి తీవ్రంగా రక్తస్రావమైంది. బిడ్డను ఐసీయూలో ఉంచి చికిత్స అందించాలని చూశారు. వీలుకాక పోవడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు బిడ్డను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. బిడ్డ పరిస్థితి ఏమీ చెప్పలేమని వైద్యులు అంటున్నారని ఆదివారం కుటుంబీకులు పేర్కొన్నారు. దీనికంతటికీ జూనియర్ డాక్టర్లు ఆపరేషన్ చేయడమే కారణమని వారు ఆరోపిస్తున్నారు.

నేటినుంచి సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు

- కట్టుదిట్టంగా నిర్వహిస్తామన్న డీఈవో వరలక్ష్మి



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్మెంట్-2 (వార్షిక) పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఒకటి నుంచి ఎనిమిది తరగతులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తొమ్మిదో తరగతికి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 2466 ప్రభుత్వ, జడ్పీ, మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,54,191 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు ప్రశ్నపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్, ఆరు నుంచి తొమ్మిది వరకు మండల వనరుల కేంద్రంలో భద్రపరిచామన్నారు. పరీక్షలకు గంట ముందు ప్రశ్నపత్రాలను తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఆయా యాజమాన్యాలు ప్రశ్నపత్రాలు తయారు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు చెప్పారు. మండల స్థాయిలో ఎంఈవోలు, క్లస్టర్ స్థాయిలో సీఆర్‌సీ హెచ్‌ఎంలు పరీక్షలను పర్యవేక్షించనున్నట్లు వివరించారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


కాశీవిశ్వేశ్వరుడు

రామకుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపండితులు స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరణలు చేశారు. స్థానిక జ్యోతినగర వైశ్యులు అందించిన స్వామి, అమ్మవార్ల పంచలోహ ఉత్సవమూర్తులకు నాగరాజశర్మ నేతృత్వంలో వేదపండితులు ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. సాయంత్రం రైతు సంఘం ఆధ్వర్యంలో గణపతి పూజ, రక్షాబంధనం, ధ్వజారోహణం, అంకురార్పణ, కలశస్థాపన, హోమాలు చేపట్టారు. రాత్రి ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై మాడవీధుల్లోమంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు అందించారు.

కంటివైద్య శిబిరానికి స్పందన



శస్త్రచికిత్సలకు ఎంపికైన వారితో పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో వైద్యనిపుణులు 63 మందికి కంటి పరీక్షలు చేసి 8 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన వారికి నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సౌకర్యకరంగా ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్న మహతి ఫౌండేషన్ వారికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈఎస్ వైద్యులు, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

65 మందికి నేత్ర పరీక్షలు



నేత్రపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు మురళీ

పలమనేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్స శిబిరంలో నేత్రవైద్యులు మురళీ 65 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 40 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఆపరేషన్లు చేసుకునే వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని.. చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సదుపాయం కల్పిస్తామని శంకర నేత్రాలయ వైద్యులు తెలిపారు.

ముత్యాలమ్మకు వెండి కిరీటం వితరణ

రొంపిచెర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల గ్రామదేవత ముత్యాలమ్మకు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు సంగి నరసింహులు, పుట్టా శిరీషా ఆదివారం రూ.27,600 విలువ చేసే వెండి కిరీటం అందించారు. ఆలయ పూజారి గుణ అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పుట్టా విజయలక్ష్మీ, కృష్ణమూర్తి, విద్యశ్రీ, యశశ్వి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి గోశాలకు రూ.80 వేల విరాళం

చౌడేపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ గోశాలకు ఆదివారం తిరుపతికి చెందిన అమ్మవారి భక్తుడు బాలాజీ రూ.80 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. దాతకు అమ్మవారి దర్శనం కల్పించి సత్కరించించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పట్టపగలే ఇసుక అక్రమ తవ్వకాలు

● ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

గంగవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా కౌండిన్య నదీ కాలువలో ఇసుక తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌తో సహా ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. కూర్నిపల్లె సమీపంలోని కౌండిన్య నదీ కాలువలో పట్టపగలే ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తవ్వి ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నారని రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదులందాయి. పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కలకటవారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ కలకటవారిపల్లెలో రెండేళ్ల క్రితం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అయితే అదే గ్రామానికి చెందిన అగ్రకులాల వారు విగ్రహాన్ని తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్ల ఎదుట నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు రెడ్డెప్ప, నరేశ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోనమందలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

సోమల: సోమల మండలం బోనమందలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ హనుమంతుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు అందించిన రూ.10 లక్షల ఆర్థిక సాయంతో పాటు గ్రామస్తుల విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. ఈక్రమంలోనే ఆలయంలో ప్రతిష్ఠించిన మూలవిరాట్‌లను గ్రామంలో ఊరేగించారు.

కమనీయం.. కల్యాణం..
సీతారాముల వైభోగం..!

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు


పలమనేరు: స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, రేణుకారెడ్డి దంపతులు


పలమనేరు బజారువీధిలో..


పుంగనూరు ఆలయంలో సందడిగా భక్తులు


వి.కోటలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి


చౌడేపల్లె మండలం బిల్లేరు రామాలయంలో...

కుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని వివిధ రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని రామాలయాల్లో స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్, గుడుపల్లె మండల అధ్యక్షుడు వడివేలు, శాంతిపురం మండలాధ్యక్షుడు రామచంద్రుడు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్, అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్, కుప్పం ప్రధాన కార్యదర్శులు కేఆర్.శ్రీహరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం పొడమల గ్రామంలో ఆచార్య ప్రబోధానంద స్వామివారి జయంతి వేడుకలను పురస్కరించుకుని జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో కుప్పం నుంచి భక్తులు పాల్గొన్నారు. అలాగే కుప్పంలోని ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ ఛైర్మన్ టీఎం.దయానిధి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరుల్ రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరు మండలంలో ఆదివారం శ్రీరామ నవమి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలమనేరు జవుళివీధి, బజారు వీధుల్లోని శ్రీరామ భజన మందిరాలు, శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ఆయన సతీమణి రేణుకారెడ్డి తెలుగుదేశం నాయకులతో కలిసి పలమనేరు బజారువీధిలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులను ఆహ్వానించి వారికి తీర్థప్రసాదాలు అందించారు. పలమనేరు మండలం కొలమాసనపల్లి గ్రామంలో వెలసిన వైకుంఠ రామాలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవం చేపట్టారు. యం.ఎస్.అరుణ, ప్రభాకర్ గుప్తా(బేతమంగళం), యం.వాసంతి, శ్రీనాథ్ దంపతులు, చంద్రశేఖరశెట్టి ఉభయదారులుగా వ్యవహరించారు.

● కల్లూరు: పులిచెర్ల మండలంలోని శ్రీరామ మందిరాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కల్లూరు, మతుకువారిపల్లిలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకలు కనులపండువగా జరిగాయి. కల్లూరులో రాత్రి పుష్పపల్లకీపై సీతారాములు పురవీధుల్లో ఊరేగారు.


కల్లూరు: మతుకువారిపల్లిలో కల్యాణోత్సవం

● రామకుప్పం: రామకుప్పం మండలంలో ప్రజలు శ్రీరామనవమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాలు, వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేపట్టారు. రామకుప్పంలో బీజేపీ నేతలు, కోదండ రామాలయ నిర్వాహకులు సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి చిత్రపటాలకు పూజలు చేశారు. భక్తులకు వడపప్పు, పానకాలు, మజ్జిగ పంపిణీ చేశారు. రామకుప్పం శివార్లలలోని పిల్లిగుట్టలు, మిట్టపల్లెల్లో ని ఆంజనేయస్వామి ఆలయాలు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి.


కుప్పంలో భక్తులకు అన్నదానం చేస్తున్న తులసీనాథ్ తదితరులు

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలంలో ఆదివారం శ్రీరామనవమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కోదండ రామాలయం, వీరాంజనేయస్వామి, శేషాద్రిస్వామి, బాటగంగమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరి, కడపనత్తం నలగుండ్రాయస్వామి, పట్నపల్లె కల్యాణ వెంకన్న, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి, తీర్థంలోని రామచంద్రస్వామి , రామసముద్రం శ్రీరామాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రామకుప్పం: అలంకరణలో ఆంజనేయస్వామి

● చౌడేపల్లె: బిల్లేరులోని రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివార్లకు వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్థానిక కమలాంజనేయస్వామి, హరిమందిరం, గోసలకురప్పల్లెలో వెలసిన రామాలయం, చౌడగానిపల్లె, పెద్దూరు, బజారు వీధిలోని రామాలయం, మండలంలోని పలు ఆలయాలల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పలమనేరు: అలంకరణలో సీతారామాంజనేయులు

● రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లె, వడ్డేవారిపల్లె, సవ్వావాండ్లపల్లె, రొంపిచెర్ల ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. చెంచమరెడ్డిగారిపల్లె, రొంపిచెర్లలో సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చెంచమరెడ్డిగారిపల్లెలో ఉభయదాతలుగా యశోదరాణి, రఘునాథ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలలో చెంగల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మాధవ, సాయి, డిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● పుంగనూరు: పుంగనూరులోని నాగపాళ్యం, కట్టకిందపాళ్యం, మార్లపల్లె, మాగాండ్లలపల్లె, గుట్టపల్లె, అరవపల్లె, హైస్కూల్ వీధిలోని రామాలయాలు, సుబ్బమ్మ చెరువు మొరవలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.


సోమలలో విగ్రహ ప్రతిష్ఠ

● వి.కోట: వి.కోటలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. దుర్గమమాంబ ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి దంపతులు, కమిటీ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.


బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయం వద్ద..


రొంపిచెర్లలో...


తీర్థంలో రామచంద్రస్వామి..

స్తంభించిన ఏపీ ఫైబర్ సేవలు

రామకుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో ఏపీ ఫైబర్ సేవలు రోజురోజుకు అధ్వానంగా మారాయి. నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో సుమారు 10 వేలకు పైగా ఏపీ ఫైబర్ వినియోగదారులున్నారు. గత ఆరునెలలుగా నియోజకవర్గంలో సేవలకు రోజూ రెండు మూడు గంటల పాటు అంతరాయం కలుగుతోంది. దీంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆదివారం నియోజకవర్గంలో పూర్తిగా ఏపీ ఫైబర్ సేవలు స్తంభించాయి. రాత్రి వరకు సేవల పునరుద్ధరణ జరగలేదు. పండుగ పూట కుటుంబ సభ్యులంతా కలిసి ఆహ్లాదంగా గడపాల్సిన వేళ ఏపీ ఫైబర్ సేవలు స్తంభించడంపై వినియోగదారుల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఆపరేటర్లను సంప్రదిస్తే టెక్నికల్ టీమ్ సహాయ నిరాకరణతో సేవలు స్తంభించాయని చెబుతున్నారు. టెక్నికల్ టీంకు ఏపీ ఫైబర్‌నెట్ సకాలంలో టీఏ, సర్వీసు ఛార్జీలు అందించకపోవడంతో వారు సేవలు పునరుద్ధరించడంపై అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఇప్పటికైనా కుప్పం నియోజకవర్గంలో ఏపీ ఫైబర్ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు ఐక్యంగా పోరాటం చేయాలని వాల్మీకి సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించి వాల్మీకులను ఏకతాటిపైకి తీసుకురావడానికి అందరి సహకారం అవసరమన్నారు. వాల్మీకులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అనంతరం పలమనేరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన భాస్కర్‌ను సన్మానించారు. సమావేశంలో వాల్మీక సంఘ నాయకులు అద్దాల నాగరాజు, శ్రీనివాసులు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు

కుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వాసుదేవరెడ్డి తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులతోపాటు ఎంబైపీసీ కోర్సును కొత్తగా ప్రవేశ పెట్టామన్నారు. ఈ కోర్సులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో నిర్వహిస్తామన్నారు. పదో తరగతి రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు ఈనెల 1 నుంచి ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు.

సింహ వాహనంపై ఊరేగిన సోమేశ్వరస్వామి



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమీందార్ ప్యాలెస్ వద్ద వెలసిన సోమేశ్వరస్వామి ఆదివారం సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామివారికి మంగళహారతులు అందించారు. పట్టణంలోని శ్రీరాముని ఆలయంలో పూజలు చేపట్టారు.

పల్లకీలో సాయిబాబా విహారం

సోమల ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో శ్రీరామనవమి సందర్భంగా పెద్దఉప్పరపల్లె, సోమల, కందూరు, పత్రపల్లె, గన్నావారిపల్లె, వల్లిగట్ల, దిడ్డివారిపల్లె, నెల్లిమంద, కమ్మపల్లె తదితర గ్రామాల్లో కొలువుదీరిన రామాలయంలో అభిషేక పూజలు చేపట్టారు. సాయినగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని ఊరేగించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


వి.కోటలో బీజేపీ జెండా ఎగురవేస్తున్న నేతలు



పుంగనూరు: బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


రామకుప్పంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశానికి అండగా నిలిచింది బీజేపీ మాత్రమేనని తెలిపారు. అన్ని రాజకీయ పక్షాలు లౌకిక వాదం పేరిట దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి దేశ అభివృద్ధికి, రక్షణకు అడ్డుగోడలుగా నిలిచాయన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వాలు దేశాన్ని అన్నిరంగాల్లో పురోగమన మార్గంలో పయనింపజేశారన్నారు. వారితోనే దేశ సమగ్రత సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రాజసింహ, మండల అధ్యక్షుడు ఆంజనేయప్ప, ఆనంద్, లోకేశ్‌రెడ్డి, నాగరాజు, అప్పస్వామి, రవి పాల్గొన్నారు.

● వి.కోట: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని వి.కోటలో ఆ పార్టీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ నేతృత్వంలో ఎగవ చెక్‌పోస్టులో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, కవిత, నావిక, మాధవ్, మోహన్, చలపతి, హనుమంతరెడ్డి, నవీన్‌కుమార్, చరణ్, రమేష్, మణి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పుంగనూరు: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పుంగనూరులో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక సర్కిల్‌లో భారతీయ జనతాపార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు, జగదీష్‌రాజు, మల్లికారాణి, నానబాలకుమార్, మణి, ప్రసాద్, పెద్దమఠం బాబు, నాగరాజు, రమేశ్, అమర్, నారాయణ, వెంకటేశ్‌రెడ్డి, ఉమాశంకర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నంది, వృషభ వాహనాలపై అగస్తీశ్వరస్వామి విహారం


నంది వాహనంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో ఆరు రోజులుగా ఘనంగా పంగుణి వార్షిక బ్రహ్మోత్సవాలుజరుగుతున్నాయి. ఆదివారం ఉదయం రాధాబాయమ్మ, శ్రీనివాసమ్మ, మార్కొండచ్చారి, గోపాలాచ్చారి, మణికంఠ, శంకర్‌ల ఉభయంతో ఆలయ ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో అర్చకులు శివకుమార్ శివాచార్యులు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఉదయం విశేష అలంకారంలో అధికార నంది వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నగర మొదలియార్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలో వృషభ వాహనంపై స్వామి,అమ్మవార్లు దర్శనమిచ్చారు. టీడీపీ నాయకులు వసంత్‌కుమార్, కాలభైరవట్రస్టు వ్యవస్థాపకులు వెంకటేషన్, లత జ్యూవలరీస్ యజయాని మల్లీఆచ్చారి దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నిలయంగా మారిన మలుపు


పాలసముద్రంలో ప్రమాదకరంగా మలుపు

పాలసముద్రం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో పాలసముద్రం వద్ద మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. బలిజకండ్రిగ నుంచి ఎల్‌ఎన్ పురం వరకు 13 కిలోమీటర్లు సింగిల్ రోడ్డు ఉంది. పాలసముద్రం వద్ద యూటర్న్ కావడం, మలుపు వద్ద సరైన సూచిక బోరు లేక పోవడంతో ద్విచక్ర వాహన దారులు అదుపు తప్పి పడిపోతున్నారు. గాయాల పాలవుతున్నారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మలుపుల వద్ద రోడ్డును విస్తరించి స్పీడ్ బ్రేకర్లు వేస్తే ప్రమాదాలను కొంత వరకు నివారించ వచ్చునంటున్నారు. ప్రభుత్వం నేతలు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాల్సివ అవసరముంది.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


పెనుమూరులో బీజేపీ జెండా ఎగురవేస్తున్న పార్టీ నాయకులు

విజయపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. భరతమాతకు పూజలు చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్, మండల బీజేపీ అధ్యక్షుడు రాము, నాయకులు పురుషోత్తంరెడ్డి, యుగందర్‌రాజు, జలజ తదితరులు పాల్గొన్నారు. **నిండ్ర:** మండల కేంద్రంలో బీజేపీ నాయకులు తమ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తా నారాయణస్వామి మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీ పాలనలోనే సాధ్యమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాంప్రసాద్, గుణశేఖర్‌రెడ్డి, తేజ, రామచంద్రరాజు, వెంకటరాజు, ఆనందయ్య పాల్గొన్నారు. **పెనుమూరు:** పెనుమూరులోని హనుమాన్ సర్కిల్, బస్టాండు, గాంధీ కూడలి వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ మండల అధ్యక్షురాలు గుత్తా ఉషారాణి, ప్రధాన కార్యదర్శి పరందామయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, జనసేన మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు వాసుదేవనాయుడు, రామ్మూర్తిరెడ్డి, కిషోర్‌నాయుడు, శివయ్యానాయుడు, నారాయణమ్మ, గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

తలారిపల్లిలో వైభవంగా కుంభాభిషేకం


పూజల్లో ఆలయ నిర్మాతల కుటుంబసభ్యులు

పెనుమూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తలారిపల్లిలో నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో ఆదివారం ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు.గ్రామానికి చెందిన రిటైర్డ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మునిరాజు కుటుంబ సభ్యులు ఈ ఆలయాన్ని నిర్మించారు. తమిళనాడు నుంచి వచ్చిన వేదపండితులు కుంభాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం తీర్థప్రసాదాలు అందజేశారు. పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. టీడీపీ నేతలు రుద్రయ్యానాయుడు, హరిబాబునాయుడు, తలారిరెడ్డెప్ప, కార్జాల అరుణ, మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, జనసేన యుగందర్, నాగరాజు, యువరాజుల ఎనాయుడుతో పాటు అన్ని పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమంత, సర్వభూపాల వాహనంపై విహారం


సింహవాహనంపై స్వామివారు

వెదురుకుప్పం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సీతారాముల సమేత లక్ష్మణ ఉత్సవమూర్తులను ఆదివారం హనుమంత, సర్వభూపాల వాహనంపై ఊరేగించారు. శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలోని సీతారాముల ఆలయంలో సుప్రభాత సేవ, తిరుమంజనం వంటివి నిర్వహించారు. తర్వాత హనుమంత వాహనంపై ప్రతిష్టించి ఊరేగించారు. ఊరేగింపు తర్వాత శ్రీరామ నవమి ఆస్థానం నిర్వహించారు. రాత్రి సర్వభూపాల వాహనంపై ఊరేగించగా ఇంటింటా కర్పూర హారతులతో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, వేద పండితులు రమేష్, శబరి, గోపాలాచారి, వేదపారాయణుడు శివశర్మ, షరాబు బాబుసురేష్, ఉద్యోగులు హాజరయ్యారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం


కార్వేటినగరంలో సీతారాముల కల్యాణోత్సవంలో మాంగళ్యం చూపుతున్న అర్చకుడు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి):: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం వేపంజేరిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రధాన గోపురం పక్కన ఉన్న సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హోమం చేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్ , పలువురు భక్తులు పాల్గొన్నారు. పలుగ్రామాల్లోని సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవాలను నిర్వహించారు. గంగాధరనెల్లూరు ఎగవూరులోని సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేల్కూరు వీరాంజనేయస్వామి ఆలయంలో గరుడ వాహనంపై సీతారామలక్ష్మణ ఉత్సవవిగ్రహాలను అధిష్ఠింపజేసి విశేషంగా పూజలు చేశారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, వేద పండితులు,తదితరులు హాజరయ్యారు. **తవణంపల్లె:** అర్థగిరి, అరగొండ, టి.పుత్తూరు కోదండరామాలయాల్లో, తవణంపల్లె రామాలయంలో ఆదివారం నవమి వేడుకలను నిర్వహించారు. అర్థగిరి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచ్చార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కల్యాణం...కమనీయం

ఊరూవాడా ఘనంగా రాములోరి పెళ్లి


పెరుమాళ్లపల్లెలో ప్రసాద వితరణ


చిత్తూరు కోదండరామలయంలోని మూలవిరాట్టు


చిత్తూరు రామాలయంలో క్యూలో భక్తులు


అర్ధగిరిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం రామ నామ స్మరణతో సందడి సంతరించుకుంది. రామాలయాలు, భజనమందిరాల్లో అభిషేకాలు, పూజలు, కళ్యాణోత్సవాలు నిర్వహించారు. ప్రముఖ రామాలయంలో ఆదివారం రామనవమి వేడుకలు ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గిరింపేట సీబీ రోడ్ తోట పాళ్యెం,, 75 దొడ్డిపల్లెలలో సీతారామల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గోడుగుమూరు రామ భజనమందిరంలో మహేష్, దేవరాజుల రెడ్డిల ఆధ్వర్యంలో కల్యాణం, అన్నదానం నిర్వహించారు. బజారు వీధిలో నగర ముస్లిం యువత రామభక్తులకు తాగునీరు, పానకం, వడపప్పు పంపిణి చేశారు. స్థానిక మహాలక్ష్మి గోదాదేవి అంజనేయ స్వామి సమేత వెంకటేశ్వరాలయం, గిరింపేట మరాటి వీధితో పాటు పలు ప్రాంతాలో వైభవంగా కార్యక్రమాలను నిర్వహించారు. , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయపురం: చిన్నఆలపాకం, విజయపురం, జగన్నాథపురంలో శ్రీరామనామ క్షేత్రంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం అభిషేకం, అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సుగుణా మురళీకిషోర్, ప్రధాన అర్చకులు రాంప్రసాద్‌శర్మ, మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** సింధురాజపురంలో అభయాంజనేస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

యాదమరి: మండలకేంద్రంలోని కోదండ రామ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నవమి వేడుకల నేపథ్యంలో ఆదివారం ఉదయం మూలవర్లకు ప్రత్యేక అలంకరణలో అభిషేక పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. రాత్రి శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బి. మురుగేష్, ఎస్. గోపి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుడిపాల: కోలావూరు, గొల్లపల్లి, 197 రామాపురం గ్రామాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గొల్లపల్లిలో నిత్య సుందరం కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టాభిషేకం, కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. **పెనుమూరు:** పెనుమూరు ముత్యాలమ్మ ఆలయంలో హరిప్రసాద్, లిఖిత దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. చిత్తూరు- పెనుమూరు మార్గంలో వాగ్దేవీ సవితా సేవాశ్రమంలో జైశ్రీరాం నినాదాలతో సీతారాములు కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆశ్రమ ప్రధాన కార్యదర్శి హరగోపాల్ అర్చకులు చంద్రశేఖర్ శ్రీదేవి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. **నిండ్ర:** మండల కేంద్రంలో సీతారాముల కల్యాణోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. **నగరి:** బేరి వీధి, సాతభజన గుడి, కొత్తపేట, అయనంబాకం,మేలపట్టు, రాజులకండ్రిగల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు జరిగాయి. ప్రత్యేక అభిషేకాలు చేసి, విశేష అలంకరణ చేశారు.భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. **వెదురుకుప్పం:** పెరుమాళ్లపల్లె గుండుపల్లి,సంతబయలులోని రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఓ శిశువును పడుకొబెట్టి జైశ్రీరామ్ అలంకరణ ఆకట్టుకుంది.





చిత్తూరు గిరిపేట వీరాంజనేయస్వామి ఆలయంలో మాంగల్యధారణ ఘట్టం- స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు - యాదమరిలో కోదండరామయ్య కల్యాణోత్సవం- గొల్లపల్లిలో ప్రత్యేక పూజలు

నేడు నగరపాలక కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు.తప్పక హాజరుకావాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వరసిద్ధుని ఆలయ ఆధ్వర్యంలో గో సంరక్షణ ట్రస్టుకు గుంటూరుకు చెందిన రాధాకుమారి,శివప్రసాద్‌లు ఆదివారం రూ.1,00,116ను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం


సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప

పాలసముద్రం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నరసింహాపురంలోని భూతలకోన అటవీప్రాంతంలో ఆదివారం సారా తయారీ స్థావరంపై పోలీసులు దాడిచేశారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో స్థావరానికి వెళ్లడంతో నిందితుడు పెరియసామిరెడ్డి పారిపోయాడు. 20 లీటర్ల సారాను స్వాధీన పరచుకున్నారు. 400 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నారాయణి అమ్మ సేవలో మంత్రి అనిత



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం తమిళనాడు శ్రీపురం గోల్డన్ టెంపుల్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. అమెకు టెంపుల్ పీఆర్వో కళ్యాణ్ చక్రవరి స్వాగతం పలికి పూజలకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గురజాల జీవన్ పాల్గొన్నారు.

ఘనంగా గరుడ సేవ, కల్యాణం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొన్నియమ్మ గుడి వీధి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా నిర్వహించిన శ్రీ రామనవమి వేడుకల్లో భక్తుల ఉభయంతో గరుడ సేవ జ.రిగింది. స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి విశేష అలంకారంలో గరుడ వాహనంపై ఊరేగి ంచారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు ఆలయ ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో అర్చకలు సుధాకర్ గురుకుల్ కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణి చేశారు.

ఉత్సాహంగా జై శ్రీరామ్ బైక్ ర్యాలీ



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం బీజేపీ వ్యవస్థాపక దోనోత్సవాన్ని ఆపార్టీ, ఆర్‌ఎస్ఎస్, విహెచ్‌పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపాళ్యెం నుంచి బైక్‌లతో జైశ్రీరాం అంటై ర్యాలీ నిర్వహించారు.

ముగిసిన తూగుండ్రం క్రికెట్ లీగ్ టోర్నమెంట్


ఆవలకొండ జట్టుకు నగదు అందజేస్తున్న టీడీపీనేత జీవరత్నం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): యువకులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తేనే ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుందని పార్లమెంట్ టీడీపీ టీఎన్‌టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నం అన్నారు. తూగుండ్రం హైస్కూల్లో తూగుండ్రం క్రికెట్ లీగ్ (టీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో 23 క్రికెట్ జట్లు పోటీపడ్డారు. టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొదటి బహుమతి కింద ఆవలకొండ క్రికెట్ జట్టుకు రూ.15వేలు, రెండవ బహుమతిగా తూగుండ్రం దళితవాడ క్రికెట్ జట్టుకు రూ.8వేలు, మూడవ బహుమతి టీ అంబోధరపల్లె దళితవాడ జట్టుకు రూ.4వేలను నిర్వాహకులతో కలిసి జీవరత్నం అందజేశారు. టోర్నమెంట్ నిర్వహణకు రంగాపురానికి చెందిన తాళ్ళూరి శివనాయుడు రూ.20వేలు, ఆరిమాకులపల్లెకు చెందిన తిరుమలనాయుడురూ.10వేలను అందించి సహకరించారని నిర్వాహకులు పేర్కొన్నారు. టోర్నమెంట్ మేనేజర్లు వేలాయుధం, జ్యోతిరాజ్, బాబు , టోర్నమెంట్ నిర్వాహకులు శరత్‌కుమార్, శాంతకుమార్, సంజయ్‌కుమార్, విన్సెంట్, జోషేంద్రబాబు, అరుల్‌నాథన్ పాల్గొన్నారు.

పూతలపట్టులో బీజేపీ జెండా ఆవిష్కరణ


ఎమ్మెల్యే మురళీమోహన్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రసాద్

పూతలపట్టు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీజేపీ 42వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు శంకర్ నాయుడు, సోమశేఖర్ నాయుడు, లావణ్యతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. **గుడిపాల:** సీఎం కండ్రిగలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిట్టిబాబు, దేవరాజు, నిత్యానందం, మురారి ఆనంద్, ఆదికేశవులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

వెదురుకుప్పం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్ అన్నారు. ఆదివారం భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆళ్లమడుగు పంచాయతీ నాగార్జున కాలనీలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. బూత్ కమిటీ అధ్యక్షుడు కె.రుక్మాందర రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకులు మునస్వామి, సాయి, గోవింద్,పొన్నిరెడ్డి పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలోనే ప్రపంచదేశాలకు ఇండియా సత్తా నిరూపించారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ, రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్, జిల్లా బీజేపీ కార్యదర్శి జి.కె.చౌదరి అన్నారు. గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలి, అగరమంగళం గ్రామాల్లో మండల బీజేపీ అధ్యక్షుడు గొడ్డిండ్ల ఆనంద బాబు అధ్యక్షతన ఆ పార్టీ జెండాలను ఎగురవేశారు. బీజేపీ, టీడీపీనేతలు మురళి, గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, మునిరత్నంనాయుడు, శకుంతల, ఇరసయ్య, వెంకటేష్, షణ్ముగంలు పాల్గొన్నారు.

హంస, సూర్యప్రభలపై పురుషోత్తముడి వెలుగులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో మూడు రోజులుగా స్వామి వారి రామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు బాలాజీ స్టోర్స్, రామ్మూర్తి పిళ్ళై బ్రదర్స్, రాజేంద్రన్, ప్రభాకర్ నాయుడుల ఉభయంతో ప్రత్యేక అభిషేకం, పూజలు, అలంకరణలో హంస వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం మునస్వామి నాయుడు, జ్యోతి మాధవన్, ఎల్.బి. చంద్రన్‌ల ఉభయంతో సూర్యప్రభ వాహనసేవను నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. తోటపాళ్యంలో శశికళ కుటుంబం నివాసముంది. ఈమెకు కొన్ని నెలలుగా కడపునొప్పితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం సమీపంలో ఉన్న ఓ చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శేషవాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి, ఏప్రిల్06(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కామాక్షిసమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం కరకంఠేశ్వరస్వామిని శేషవాహనంపై ఊరేగించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారిని శేషవాహనంపై మాడవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను సంసిణీ చేశారు.

రోగులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ

బంగారుపాళ్యం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు వినీల్ జన్మదినాన్ని పురష్కరించుకుని ఆదివారం మండల కేంద్రమైన బంగారుపాళ్యం ఆస్పత్రిలో తంబుగానిపల్లెకు చెందిన మోహన్ నాయుడు 30 మంది రోగులకు పండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు హేమచంద్ర నాయుడు, బీసీ రవీంద్ర నాయుడు, సూరి నాయుడు, లోకనాథ నాయుడు, సీఐ కత్తి శ్రీనివాసులు, డాక్టర్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మెరపగుట్టపల్లెలో ఘనంగా పశువుల పండగ



పరుగులు తీస్తున్న పశువులు- పశువును అల్లిలోకి వదులుతున్న ఎమ్మెల్యే మురళిమోహన్

ఐరాల, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): 35 యర్లం పల్లె పంచాయతీ దివారిపల్లె మెరపగుట్టపల్లెలో ఆదివారం పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకకు ఎమ్మెల్యే మురళిమోహన్ హాజరయ్యారు. పూజలు నిర్వహించారు. అనంతరం పశువులను అల్లిలోని వదిలారు. పశువులు పరుగులు తీస్తుంటే యువకులు ఉత్సాహంగా వాటితో పాటు పరుగులు తీశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, పాతపాళ్యం సర్పంచ్ లోకేష్, గంగారపుహరి బాబునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.